సాక్షి తిరుపతి
సోమవారం । 19 । ఆగస్టు । 2024



ఆవేదన.. ఆందోళన

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అమానుష ఘటనపై తిరుపతిలో వైద్యులు నిరసన తెలిపారు. - 8లో



అడుగంటిన కండలేరు

కండలేరు జలాశయం డెడ్ స్టోరేజీకి చేరుకుంది. సోమశిల నుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో నీటి నిల్వలు పడిపోయాయి. - 8లో



రేషన్ బియ్యం పట్టివేత

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండు వాహనాలను సీజ్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వద్దకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 77,807 మంది స్వామిని దర్శించుకున్నారు. 38,340 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.4.02 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. అంతకన్నా ముందుగా వెళ్లిన వారిని లోనికి అనుమతించబోమని ప్రకటించింది.

తిరుమలలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

– పోలీసులతో జాయింట్ ఆపరేషన్



తిరుమలలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు, పోలీసులు

తిరుమల: తిరుమలలోని బాలాజీ నగర్ వెనుక భాగంలో ఉన్న కార్మికుల నివాసాలపై ఆదివారం టీటీడీ విజిలెన్స్, భద్రతా సిబ్బంది స్థానిక పోలీసుల సహకారంతో దాడులు చేసి అనధికారికంగా ఉంటున్న వారిని గుర్తించారు. గతంలో తిరుమలలో వివిధ నిర్మాణ పనుల్లో కూలీలుగా పనిచేసిన కార్మికుల కోసం తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేశారు. తిరుమలలో పనులు పూర్తయినా చాలా మంది ఇప్పటికీ 70కి పైగా షెడ్లలో నివసిస్తున్నారు. ఇందులో కొంతమంది అనధికార వ్యక్తులు కూడా ఉన్నారు. తిరుమలలో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని విజిలెన్స్ అధికారులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య జాయింట్ ఆపరేషన్ చేపట్టారు. ఇందులో కార్మికుల జాబితాను ధ్రువీకరణ కోసం ఇంజినీరింగ్ విభాగానికి పంపించారు. అనధికారికంగా పాగా వేసే వారిని నిలువరించేందుకు ఇకపై ఇలాంటి దాడులు కొనసాగిస్తామని టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. తిరుమలలో అనధికారికంగా నివసిస్తున్న వ్యక్తులు, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

హోంగార్డు సస్పెన్షన్

తిరుపతి క్రైమ్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారి నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న హోంగార్డు శ్రీనివాసులుపై సస్పెన్షన్ వేటు పడింది. ఆదివారం ఈ మేరకు ఎస్పీ సుబ్బరాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతిలో పలువురు వాహనదారుల నుంచి నగదు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. దీనిపై విచారణ చేపట్టగా శ్రీనివాసులు ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించిన వారి నుంచి నగదు డిమాండ్ చేస్తున్నట్లు నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

● కేరింత

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



సెలవు రోజున చిన్నారుల సంతోషానికి హద్దే ఉండదు. ఆటపాటలకు అడ్డే ఉండదు.. అందులో భాగంగానే ఆదివారం తిరుపతి సమీపంలోని తుమ్మలగుంట క్రీడా మైదానం పిల్లల ఆనందానికి అడ్డాగా మారిపోయింది. కేరింతలతో మార్మోగిపోయింది. అదే సమయంలో ఆకాశంలో విహరిస్తున్న హెలిక్యాప్టర్‌ను చూసి భావి పౌరుల్లో ఉత్సాహం ఉప్పొంగింది. యంత్ర పక్షిని అందుకునేందుకు మనసు రెక్కలు తొడిగింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

● పులకింత



శ్రీమహావిష్ణువు కొలువైన తిరుగిరులు.. ప్రకృతి అందాలతో అలరారుతుంటాయి.. రమణీయ దృశ్యాలతో కనువిందు చేస్తుంటాయి. ఆకాశాన్నంటే భారీ వృక్షాలతో అబ్బురపరుస్తుంటాయి.. ఒంపులు తిరిగిన దారులతో కట్టిపడేస్తుంటాయి. ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతూ విశేషాచలంగా కీర్తిగడించాయి. మహిమాన్విత ఏడుకొండల సానువుల్లో శ్రీవారి దివ్యరూప సాక్షాత్కారమైంది. అపురూప దృశ్యం 'సాక్షి' కెమెరా ద్వారా ఆవిష్కృతమైంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లాలి.. ఆ పార్టీ నేతలపై కేసులు నమోదు చేయాలి.. భయభ్రాంతులకు గురిచేసి పక్కకు తప్పించాలి.. ఇదే లక్ష్యంతో కూటమి సర్కార్ ప్రణాళికాబద్ధంగా నాటకాలాడుతోంది. ఎక్కడ ఏం జరిగినా.. చీమ చిటుక్కుమన్నా.. వైఎస్సార్‌సీపీ నాయకులపై నెపం నెట్టేస్తోంది. ఎల్లోమీడియా అండతో అసత్యాలను ప్రచారం చేయించి పబ్బం గడుపుకుంటోంది. గతంలో ఎలాంటి అవినీతి జరగలేదని అధికారుల నివేదికలు వెల్లడిస్తున్నా నిస్సిగ్గుగా వాటిని బుట్టదాఖలు చేస్తోంది. తాము చెప్పిన విధంగా కేసులు పెట్టేయాలని పోలీసులపై ఒత్తిడి తెస్తోంది. ప్రజాసేవే పరమావధిగా చిత్తశుద్ధితో సేవలందించిన వైఎస్సార్‌సీపీ నేతలను మానసికంగా వేధిస్తూ రాక్షసానందం పొందుతోంది. ఈ క్రమంలోనే మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం.. టీటీడీ పరిపాలనా భవనంలో సంభవించిన అగ్ని ప్రమాదాలను సైతం తమకు అనుకూలంగా మలుచుకునేందుకు యత్నిస్తోంది. కక్షపూరితంగా వ్యవహరిస్తూ పచ్చమూకతో మూకుమ్మడి దాడి చేయిస్తోంది.

అబద్ధపు రాతలు కూటమి మంటలు

- అగ్నిప్రమాదాల పేరిట 'కూటమి' నాటకాలు
- వైఎస్సార్‌సీపీ నేతలకు బురద అంటించే యత్నాలు
- మదనపల్లె కలెక్టరేట్.. టీటీడీ ఏడీ బిల్డింగ్‌లో ఫైర్ యాక్సిడెంట్లపై అసత్య ప్రచారాలు
- టీడీపీ నేతల డ్రామాలను రక్తి కట్టించేందుకు ఎల్లోమీడియాలో అవాస్తవ కథనాలు
- ప్రభుత్వం ఒత్తిడితో కేసులు నమోదు చేస్తున్న పోలీసులు



టీటీడీ పరిపాలన భవనంలో అగ్నిప్రమాద దృశ్యం

సాక్షి ప్రతినిధి, తిరుపతి : ఏమూల ఏం జరిగినా.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ఆ పార్టీ నేతలకు అంటగట్టేందుకు కూటమి సర్కార్ తన ఎల్లో మీడియా ద్వారా గట్టి ప్రయత్నాలు చేస్తోంది. వాస్తవాలను పక్కనబెట్టి అవాస్తవాలను.. అభూత కల్పలను ప్రచారం చేస్తోంది. అధికారులపై ఒత్తిడి తెచ్చి వైఎస్సార్‌సీపీ నేతలను ఇబ్బందిపెట్టేందుకు శతవిధాలా విఫలయత్నం చేస్తోంది. మొన్న మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఘటన, నేడు టీటీడీ పరిపాలన భవనంలో చోటు చేసుకున్న ప్రమాదాలే ఇందుకు నిదర్శనం. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో శనివారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కొన్ని జిరాక్స్ పేపర్లు పాక్షికంగా కాలిపోయాయి. ప్రతి శనివారం పరిపాలన భవనంలోని ప్రతి విభాగంలో పూజలు చేయటం ఆనవాయితీ. అందులో భాగంగానే డిప్యూటీ ఇంజినీరింగ్ విభాగంలో దీపం వెలిగించి పూజ చేశారు. ఆ దీపం కుందె నుంచి నూనె కిందకు కారడంతో వెనుక ఉన్న చెక్కకు మంటలు అంటుకున్నాయి. కింద ఉన్న జిరాక్స్ ఫైళ్లకు వ్యాపించాయి. అదే సమయంలో భోజనానికి వెళ్లిన సిబ్బంది తిరిగి రావడంతో ముందుగా ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వారు వచ్చే లోపే మంటలను ఆర్పేశారు. అయితే కొన్ని జిరాక్స్ ఫైళ్లు మాత్రం పాక్షికంగా కాలిపోయాయి.

దుష్ప్రచారానికి బలం చేకూర్చేందుకేనా..?

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి గత వైఎస్సార్‌సీపీ సర్కార్ హయాంలో టీటీడీలో ఏదో జరిగిపోయిందంటూ పచ్చ నేతలు, ఎల్లో మీడియా అసత్య ప్రచారాలు చేసిన విషయం తెలిసిందే. అనంతరం దీనిపై 40 మందితో కూడిన విజిలెన్స్ బృందాన్ని నియమించి విచారణ సైతం చేపట్టింది. సుమారు నెల రోజుల పాటు విజిలెన్స్ అధికారులు కిందా మీదా పడినా.. ఫైళ్లన్నీ తిరగేసినా చిన్న అవినీతి జరిగినట్లు వెల్లడి కాలేదు. ఇదే విషయాన్ని విజిలెన్స్ అధికారులు నివేదిక రూపంలో ప్రభుత్వానికి తెలియజేశారు. దీంతో వెంటనే కూటమి పెద్దలు రంగలోకి దిగారు. ఏదో ఒకటి చేసి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నిందలు మోపి ఎవరినో ఒకరిని బాధ్యుడిని చేసి అరెస్ట్ చేయాలని హుకుం జారీ చేశారు. ఇక చేసేది లేక విజిలెన్స్ అధికారులు సైతం ఒత్తిడికి లొంగిపోయి 72 మంది టీటీడీ ఇంజినీర్లకు నోటీసులు జారీ చేశారు.

అగ్నిప్రమాదమే ఆయుధంగా..

విజిలెన్స్ విచారణలో ఏమీ దొరక్కపోవడంతో దిక్కుతోచని కూటమి నే9తలు శనివారం జరిగిన స్వల్ప అగ్నిప్రమాదాన్ని ఆయుధంగా మలుచుకుని వైఎస్సార్‌సీపీ నేతలు, కొందరు అధికారులపై నెపం నెట్టేందుకు కుట్రకు తెరతీశారు. తమ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్‌సీపీ నేతలే ఫైళ్లు తగులబెట్టేందుకు ప్రయత్నించారంటూ దుష్ప్రచారం మొదలెట్టారు. ఈ మేరకు ఆదివారం టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు ఎవరికి వారు మీడియా ద్వారా డ్రామాను రక్తికట్టించారు. అయితే టీటీడీ, విజిలెన్స్ అధికారులు మాత్రం అది ప్రమాదవ శాత్తు జరిగిందేనని శనివారం రాత్రే స్పష్టం చేశారు. ఆదివారం చేపట్టిన విజిలెన్స్, పోలీసుల విచారణలో కూడా ఇదే విషయం తేటతెల్లమైనట్లు ముఖ్య అధికారి ఒకరు ప్రకటించారు. ఈ ప్రమాదంలో రూ.5వేలు విలువచేసే జిరాక్స్ పత్రాలు కాలిపోయాయని వివరించారు. అయితే కూటమి నేతల ఒత్తిడితోనే కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

మదనపల్లె ఘటనలోనూ ఇంతే..!

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో గత నెల జరిగిన అగ్నిప్రమాదాన్ని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అంటగట్టేందుకు కూటమి ప్రభుత్వం శతవిధాలా యత్నించింది. ఎల్లో మీడియా కథనాల మేరకు పోలీసులు కేసు కట్టారు. అధికారులు విచారణ చేపట్టారు. అయితే ఎక్కడా ఎటువంటి అవకతవకలు జరగలేదని తేలడంతో విచారణను అమరావతికి మార్చారు. మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా, వైఎస్సార్‌సీపీ నేత మాధవరెడ్డిపై కేసు నమోదు చేసినా.. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో హైకోర్టు ఆదేశాల మేరకు 41ఏ నోటీసులు ఇచ్చి బెయిల్ మంజూరు చేశారు. అయినా వదలకుండా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో పనిచేసే తేజ అనే జూనియర్ అసిస్టెంట్‌ను అమరావతికి తీసుకెళ్లి విచారిస్తున్నారు. అగ్నిప్రమాదం చేయించింది పెద్దిరెడ్డే అని చెప్పమని తేజపై ఒత్తిడి చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించనున్నారు. అయితే సీఎం చంద్రబాబునాయుడు జిల్లా పర్యటన నేపథ్యంలో కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, డీఆర్‌ఓ పెంచల కిషోర్ గ్రీవెన్స్ అందుబాటులో ఉండే అవకాశం లేదు. ఈ క్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల పర్యవేక్షణలో గ్రీవెన్స్ నిర్వహించనున్నారు.

జిల్లా అధికారులు వచ్చేనా..?

గ్రీవెన్స్‌లో కలెక్టర్ ఉంటే 100శాతం మంది అధికారులు తప్పకుండా హాజరవుతారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అందుబాటులో ఉంటారు. కలెక్టర్ లేకుండా జేసీ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ చేపడితే 75 శాతం మంది మాత్రమే కనిపిస్తారు. కలెక్టర్, జేసీ కాకుండా డీఆర్‌ఓ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహిస్తే 50శాతం మంది అధికారులు మాత్రమే హాజరవుతుంటారు. అదీ ఉదయం 11కు వచ్చి 12.30 వరకు మాత్రమే కనిపించి వెళ్లిపోతుంటారు. ఇక కలెక్టర్, జేసీ, డీఆర్‌ఓ లేకుండా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, కలెక్టరేట్ ఏఓ తదితరులు గ్రీవెన్స్ నిర్వహిస్తే 25 శాతం అధికారులు హాజరుకావడం గగనంగా ఉంటోంది. వచ్చిన వారు కూడా కనిపించి నెమ్మదిగా జారుకుంటూ ఉంటారు. దీంతో జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వివిధ సమస్యలపై వ్యయప్రయాసల కోర్చి కలెక్టరేట్‌కు చేరుకున్న అర్జీదారులు ఉసూరుమంటూ తిరుగుప్రయాణం కావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ క్రమంలో గ్రీవెన్స్‌కు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై పూర్తి సమయం అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి వినతులు స్వీకరించాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వాలన్సిన అవసరం ఎంతైనా ఉంది.

22నుంచి రెండో విడత డిగ్రీ అడ్మిషన్లు

తిరుపతి సిటీ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న డిగ్రీ కళాశాలలో రెండో విడత అడ్మిషన్లకు ఈ నెల 22 నుంచి 24వరకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఉన్నత విద్యాశాఖ అవకాశం కల్పించింది. మొదటి విడతలో పలు డిగ్రీ కోర్సుల్లో సీట్లు పొందలేని విద్యార్థులకు ఓఏఎమ్‌డీసీ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు ఇచ్చింది. 29వ తేదీన సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేయనుంది. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలలో 30వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీలోపు ప్రవేశం పొందాల్సి ఉంటుంది.

బదిలీ.. విలువలు వదిలి!

కాసులు కురిపించే పోస్టు పట్టాలి. పెత్తనం చెలాయించే సీటు దక్కించుకోవాలి. పని తక్కువ.. పైకం ఎక్కువ వచ్చే శాఖలోకి మారిపోవాలి.. ఇదే లక్ష్యంతో పలువురు ఉద్యోగులు పైరవీలు చేస్తున్నారు. జిల్లాలో బదిలీల ప్రక్రియకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో కూటమి నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. తమ్ముళ్ల ప్రాపకం కోసం పాకులాడుతున్నారు. చెప్పిన మాట వింటామని.. అప్పగించిన పనిని తూచా తప్పకుండా అమలు చేస్తామని వేడుకుంటున్నారు. ప్రజలను.. విలువలను గాలికి వదిలేసి సర్కారు పెద్దల ఎదుట సాగిలపడుతున్నారు. ఈ క్రమంలో నిజాయితీపరులైన కొందరు ఉద్యోగులకు ఈ మంత్రాంగం అర్థంకాక కొట్టుమిట్టాడుతున్నారు. నిబంధనల ప్రకారం పనిచేయడం తప్పిస్తే అధికార పార్టీ నాయకులతో అంటకాగడం తెలియక వివక్షకు గురవుతున్నారు. చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తున్న తమ స్థానాలకు ఎవరు ఎసరు పెడతారో అని దిగాలుపడుతున్నారు.

- జిల్లాలో ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్ల ప్రక్రియకు రంగం సిద్ధం
- నిబంధనలకు తిలోదకాలిస్తున్న యంత్రాంగం
- ప్రాధాన్యతా పోస్టుల కోసం ముమ్మరంగా పైరవీలు
- కూటమి నేతల ఒత్తిడికి తలొగ్గుతున్న ఉన్నతాధికారులు



తిరుపతి అర్బన్ : జిల్లాలోని అధికారి స్థాయి నుంచి చిరుద్యోగుల వరకు టెన్షన్ వాతావరణం ఏర్పడింది. అన్ని శాఖలలో భారీ స్థాయిగా బదిలీల ప్రక్రియకు శ్రీకారం చుడుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయండతో దీనిపైనే ఉద్యోగుల్లో ముమ్మరంగా చర్చల సాగుతున్నాయి. ఎవరికి ఏ పోస్టు దక్కుతుందో ఎవరి స్థానానికి ఎవరు ఎసరు పెడతారో తెలియ పరిస్థితిలో ఉద్యోగులు సతమతమవుతున్నారు.

పెరిగిన పైరవీలు..!

రెవెన్యూ శాఖలో కీలక పోస్టులు దక్కించుకోవడానికి పలువురు రాజకీయ పలుకుబడి ఉన్న ఉద్యోగులు ముమ్మరంగా పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా తిరుపతి, గూడూరు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్‌డీఓ పోస్టులకు భలే డిమాండ్ ఉంది. ఎవరికి తోచినట్లు వారు ప్రయత్నాలు సాగిస్తున్నారు. మరోవైపు కలెక్టరేట్‌లో నాలుగు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులున్నాయి. ఆ స్థానాలను దక్కించుకోవడానికి తీవ్రమైన ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. అలాగే మైనింగ్, రిజిస్ట్రేషన్, సివిల్ సప్లయి విభాగాల్లోను ఉన్నత స్థాయి అధికారుల పోస్టులకు బాగానే డిమాండ్ పలుకుతోంది. ఇక ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించి పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, క్వాలిటీ కంట్రోల్‌లోని డీఈ, ఈఈ, ఎస్ఈ స్థానాలకు పలువురు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో పలువురు జిల్లా అధికారులు వారం రోజులుగా మంత్రుల, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ ఐదేళ్లు అందుబాటులో ఉంటూ చెప్పిన పని చేస్తామని, తమకే ప్రాధాన్యత ఉండే పోస్ట్ ఇప్పించాలని నేతలను వేడుకుంటున్నట్లు సమాచారం. అలాగే కూటమి నేతల ఒత్తిడి తట్టుకోలేక జిల్లాలోని పలువురు ఉద్యోగులు రెవెన్యూ నుంచి టూరిజం శాఖకు మారేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ప్రశాంతంగా పనిచేసుకునే విభాగాలను ఎంపిక చేసుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది.

ఓ సామాజికవర్గానికే ప్రాధాన్యం?

జిల్లాలో సోమవారం నుంచి ఈ నెల 31వ తేదికి 15శాఖల్లోని ఉద్యోగుల బదిలీలు పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందిన నేపథ్యంలో ఎవరి శక్తి మేరకు వారు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బదిలీలల్లో ప్రధానంగా ఒక సామాజిక వర్గానికే ప్రాధాన్యత ఇస్తారని స్పష్టంగా తెలుస్తోంది. దీంతో స్థానిక కూటమి నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. మొత్తంగా జిల్లాలో జోరుగా బదిలీలపైనే చర్చ సాగుతోంది.

34 మండలాల్లో మార్పులు

జిల్లాలో 34 మండలాల్లో 5వేల మంది వివిధ కేటగిరీల్లో బదిలీలు చేపట్టాల్సి ఉంది. అయితే ఐదేళ్లు సర్వీస్ పూర్తి చేసుకున్నవారితోపాటు దివ్యాంగులు, భార్య భర్తలిద్దరు ఉద్యోగులు అయితే తదితర నిబందనల మేరకు మార్పులు జరగాలి. అయితే నిబంధనలతో నిమిత్తం లేకుండా భారీగా బదిలీలు ఉంటాయని సర్వత్రా చర్చించుకుంటున్నారు. మొత్తంగా జిల్లాలో రెవెన్యూ, పంచాయతీరాజ్, పురపాలక, గ్రామ, వార్డు సచివాలయాలు, మైన్స్, పౌరసరఫరాలు, అన్ని శాఖల్లోని ఇంజినీరింగ్ ఉద్యోగులు, స్టాంపులు,రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, దేవదాయ, అటవీ, రవాణా, పరిశ్రమలు ,విద్యుత్, వాణిజ్య పన్నుల శాఖల్లో బదిలీలు చేపడుతున్నారు.

నేటి నుంచి తుది విడత కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్

తిరుపతి సిటీ : ఇంజినీరింగ్ అడ్మిషన్లకు తుది విడత కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సోమవారం నుంచి బుధవారం వరకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ అవకాశం కల్పించింది. 20 నుంచి 22వ తేదీ వరకు ఆప్షన్లకు వెసులుబాటు ఇచ్చింది. 23న ఆప్షన్ల మార్పు, 26న సీట్ల కేటాయింపు చేపట్టనుంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 34,555సీట్లు ఉండగా, రెండు కౌన్సెలింగ్ ప్రక్రియల్లో 31,287సీట్లు భర్తీ అయ్యాయి. 3,088 సీట్లను తుది విడత కౌన్సెలింగ్‌లో భర్తీ చేయనున్నారు.



క్లుప్తంగా

లారీ చక్రాల కింద పడి డ్రైవర్ మృతి

ఏర్పేడు : మండలంలోని డిక్సన్ కంపెనీ వద్ద ఆదివారం రాత్రి లారీ కింద పడి ఓ డ్రైవర్ మృతి చెందాడు. ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు కథనం మేరకు.. బీహార్‌లోని ముజాఫరాపూర్ జిల్లా, సాహెబ్‌గంజ్ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ ప్రమోద్ రామ్ (43) తన స్నేహితులు సంజయ్‌కుమార్ రాయ్, సురేష్‌బాబు కలిసి లారీలో చెన్నై నుంచి ఎల్‌ఈడీ టీవీ మెటీరియల్‌తో డిక్సన్, టీటీఈ కంపెనీలకు వచ్చాడు. ఆదివారం కావడంతో మెటీరియల్ అన్‌లోడ్ కాలేదు. ఈ క్రమంలో ముగ్గురూ మద్యం సేవించారు. ప్రమోద్ రామ్ లారీ కింద పడుకుని నిద్రించాడు. సంజయ్‌కుమార్ మద్యం మత్తులో లారీ ముందుకు కదలించడంతో కింద పడుకుని ఉన్న ప్రమోద్ రామ్ తలపై టైర్లు ఎక్కేశాయి. దీంటో ప్రమోద్‌రామ్ అక్కడికక్కడే మరణించాడు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండు బైక్‌ల ఢీ : ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో కాలిపోయిన బైక్‌లు

కోట : మండలంలోని చంద్రశేఖరపురం వద్ద ప్రధాన రహదారిపై ఆదివారం రెండు బైక్‌లు ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. వివరాలు.. చిట్టేడుకు చెందిన కుడుముల పార్వతయ్య బైక్‌పై కోటకు బయలుదేరాడు. మెట్టు గ్రామానికి చెందిన మహేష్, శ్రీనివాసులు మోటార్‌బైక్‌లో గూడూరు వైపు వెళుతున్నారు. మార్గం మధ్యలో రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో మంటలు వ్యాప్తించి రెండు బైక్‌లు కాలిపోయాయి. స్థానికుల సమాచారం మేరకు క్షతగాత్రులను 108లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆవేదన.. ఆందోళన

ప్రాణదాతలు ఆందోళనతో రగిలిపోతున్నారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అమానుష హత్యాచార ఘటనను గుర్తుచేసుకుని ఆవేదన చెందుతున్నారు. ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా విధులు నిర్వర్తించే వైద్యులకు రక్షణ కరువైందని మండిపడుతున్నారు. ఆదివారం ఈ మేరకు తిరుపతిలోని రుయా.. స్విమ్స్ ఆస్పత్రుల వద్ద నిరసనకు దిగారు. నిందితులను కఠినంగా శిక్షించేంత వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. - తిరుపతి తుడా



రుయా ఆస్పత్రి వద్ద నిరసన దీక్ష చేపట్టిన జూనియర్ డాక్టర్లు



స్విమ్స్ వద్ద ర్యాలీ చేస్తున్న వైద్యులు

అడుగంటిన కండలేరు

కండలేరు జలాశయంలో నీరు అడుగంటింది. సోమశిల నుంచి కూడా ఇన్‌ఫ్లో తగ్గిపోయింది. దీంతో ఖరీఫ్‌లో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. శ్రీపొట్టిరాములు నెల్లూరు.. తిరుపతి జిల్లాలోని రైతుల్లో ఆందోళన మొదలైంది. గత ఐదేళ్లుగా కళకళలాడిన చెరువులు సైతం పూర్తిగా ఎండిపోయాయి. వందలాది ఎకరాలు బీడుబారిపోతున్నాయి. అరకొరగా సేద్యం పనులు చేపట్టిన అన్నదాతల కళ్లు ఆకాశం వంక చూసి చూసీ కాయలుకాస్తున్నాయి.

- సోమశిల నుంచి తగ్గిన ఇన్‌ఫ్లో
- డెడ్ స్టోరేజ్‌కు చేరిన నీరు
- ఎండిపోయిన చెరువులు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు



కండలేరులో డెడ్ స్టోరేజీకి చేరుకున్న నీరు

సైదాపురం : తిరుపతి, శ్రీపొట్టిశ్రీరాములు జిల్లాలకు వరప్రదాయినిగా ఉన్న కండలేరు జలాశయం ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరుకుంది. దీంతో ఆయకట్టు రైతులకు ఖరీఫ్ సాగు సందిగ్ధంలో పడింది. ఈ క్రమంలో చెరువులన్నీ చుక్కనీరు లేక ఖాళీగానే కనిపిస్తున్నాయి. గడిచిన ఐదేళ్లుగా కళకళలాడిన జలాశయాలు, చెరువులు ఇప్పుడు నీటి జాడ కోసం ఎదురుచూపులు చూస్తున్నాయి.ప్రధానంగా కండలేరు జలాశయంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 5.872 టీఎంసీలకు నీటి నిల్వ చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం తిరుపతికి తాగునీటి అవసరాల కోసం ప్రతి రోజూ 100 క్యూసెక్కులు మాత్ర మే విడుదల చేస్తున్నారు.

సోమశిలలో 23 టీఎంసీలే..!

శ్రీశైలం ప్రాజెక్ట్ గేట్లు మూసివేసిన నేపథ్యంలో సోమశిల జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గింది. దీంతో సోమశిల నుంచి కండలేరు జలాశయానికి నీటి విడుదలకు అవకాశం సన్నగిల్లింది. శ్రీశైలం పైతట్టు ప్రాంతాల నుంచి వరద ఉధృతి తగ్గడంతో జలాశయం అధికారులు గేట్లు మూసి వేశారు. ఫలితంగా సోమశిలకు ప్రతి రోజు ఎగువ ప్రాంతం నుంచి 14వేల క్యూసెక్కుల పైబడి ఉన్న వరద ప్రవాహం 10వేల క్యూసెక్కులకు పడిపోయింది. ఈ ప్రవాహం మరింత తగ్గే అవకాశం కూడా ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం సోమశిల జలాశయంలో 23 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉంది.

5.872 టీఎంసీలే..!

కనీవినీ ఎరుగని రీతిలో కండలేరు డెడ్ స్టోరేజీకి చేరుకుంది.ప్రస్తుతం 5.872 టీఎంసీలు మాత్రమే జలాశయంలో నీటి నిల్వ ఉంది. ప్రధానంగా సర్వేపల్లి, వెంకటగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాలకు చెందిన రైతులు కండలేరు నీటి ఆధార్యంతోనే పంటలు సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితిల్లో ఈ మూడు నియోజకవర్గాలకు సంబంధించి ఖరీఫ్ సాగు చేపట్టే అవకాశం లేకుండా పోయింది. వర్షాలు కూడా అంతంత మాత్రంగానే కురుస్తుండడంతో భూగర్భజలాలు సైతం అడుగంటిపోయాయి.

చుక్క నీరు లేని చెరువులు

కండలేరు జలాశయం ద్వారా వచ్చే నీటితోనే చెరువులు నిండుతుంటాయి. ముఖ్యంగా సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల్లోని ఏటా కండలేరు నుంచే నీరు విడుదల చేసే వారు. ఈఏడాది కండలేరులోనే నీరు లేకపోవడంతో చెరువులు పూర్తిగా ఎండిపోయాయి.

3లక్షల ఎకరాల ఆయకట్టు

కండలేరు జలాశయం పరిధిలో సుమారు 3 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం ఈ భూములన్నీ బీడు పెట్టుకోవాల్సిన దుస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగుపై ఇక ఆశలు వదిలేసుకోవాల్సిందే అని వాపోతున్నారు.



బీడుగా మారిన భూములు



చుక్కనీరు లేని కమ్మవారిపల్లె చెరువు

'వెరికోస్' నిర్ధారణ శిబిరాలు అవసరం



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ శ్రీహరి

చంద్రగిరి(తిరుచానూరు) : వెరికోస్ వెయిన్స్ నిర్ధారణ, నివారణకు మరిన్ని వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అవసరమని డీఎంహెచ్ఓ శ్రీహరి తెలిపారు. ఆదివారం తిరుచానూరులో భువనేష్ కన్‌స్ట్రక్షన్స్- డెవలపర్స్ సహకారంతో మెగావిన్ వాస్క్యులర్ కేర్ నిర్వహించిన వెరికోస్ వెయిన్స్ ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రస్తుత జనాభాలో 20శాతం మంది వెరికోస్ వెయిన్స్‌తో బాధపడుతున్నారన్నారు. ప్రభుత్వం తరపున బాధితులకు చికిత్సలందిస్తున్నామని, ప్రైవేట్ ఆస్పత్రుల వారు కూడా ఇందులో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందని వెల్లడించారు. ఈఎస్ఐ ఆస్పత్రి విశ్రాంత సూపరింటెండెంట్ కె.బాలశంకర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాధిపై అవగాహన పెంపొందించుకుంటే సక్రమంగా వైద్యసేవలు పొందవచ్చని సూచించారు. డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ తిరుపతిలోని డాక్టర్ హరనాథ్ ఆస్పత్రిలో ప్రతి శుక్రవారం తాము అందుబాటులో ఉంటామని, రోగులకు ఉచితంగా కలర్ డాప్లర్ టెస్ట్ చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో భువనేష్ కన్‌స్ట్రక్షన్స్ ఎండీ మల్లికార్జున్, మెగావిన్ వైద్యుడు హరీష్ రాజ్ కుమార్, సిబ్బంది వసంత్, రబియా, సునీత, శైలజ, చార్మిల, షర్మిల, కెవిన్, భువనేష్ సంస్థ సిబ్బంది గిరిధర్, పళని, సురేష్ వర్మ, గోపి, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి



హర్షవర్ధన్‌రెడ్డి (ఫైల్)

ఏర్పేడు : సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేసే ఓ యువకుడు ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు.. శ్రీకాళహస్తి మండలం చల్లపాళెం గ్రామానికి చెందిన వంకాయలపాటి ప్రతాప్‌రెడ్డి కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి (26) చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్వగ్రామానికి వచ్చాడు. తిరుపతిలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లేందుకు స్కూటీలో బయలుదేరాడు. మార్గం మధ్యలో ఏర్పేడు మండలంలోని సీతారాంపేట వద్ద నూతనంగా నిర్మించిన వంతెనపై తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వెళుతున్న కారు రాంగ్‌రూట్‌లో దూసుకువచ్చి స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో హర్షవర్ధన్‌రెడ్డి అక్కడిక్కడే మరణించాడు. స్కూటీ పూర్తిగా, కారు ముందు భాగం ధ్వంసమైంది. తిరుపతికి చెందిన కారు డ్రైవర్ గణేష్ రాజు(32)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హర్షవర్ధన్‌రెడ్డి మృతదేహానికి పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీరామ శ్రీనివాసులు వెల్లడించారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం



ఘటనాస్థలంలో పోలీసులు

చంద్రగిరి: మండలంలోని అటవీ ప్రాంతం మూలపల్లె సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు ఆదివారం గుర్తించారు. దీనిపై సమాచారం అందుకున్న సీఐ రామయ్య తన సిబ్బందితో కలసి ఘటనాస్థలానికి చేరుకున్నారు. సుమారు 20 రోజుల క్రితం మహిళ మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలంలో మద్యం బాటిళ్లు, గాజులు, చెప్పులు, మహిళ వెంట్రుకలను గుర్తించారు. అక్కడకు సుమారు కిలోమీటర్ స్థలంలో నిలిచి ఉన్న ఆటోను పోలీసులు పరిశీలించారు. అందులో రక్తపు మరకలతో ఉన్న దుప్పటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

15 మంది ఎర్ర స్మగ్లర్ల అరెస్ట్



పోలీసుల అదుపులో ఎర్రస్మగ్లర్లు

తిరుపతి మంగళం : ఎర్రచందనం కోసం అడవిలోకి చొరబడుతున్న 15 మందిని టాస్క్ ఫోర్సు పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి సంచులు, గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఇన్‌చార్జి, ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ (రిజర్వుడు) కె.సురేష్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఆర్ఎస్ఐ వై.విశ్వనాథ్ టీమ్ తిరుపతి సమీపంలోని మంగళం నుంచి కరకంబాడి మీదుగా బాలపల్లె వైపు కూంబింగ్ చేపట్టారు. ఆదివారం ఉదయం టీఎస్ పాళ్యం సెక్షన్ కరకంబాడి సమీపంలోని శ్రీవేంకటేశ్వర స్వామి గుడి వైపుగా కొంతమంది అడవిలోకి వెళుతూ కనిపించారు. వారని హెచ్చరించి చుట్టుముట్టగా కొందరు పారిపోయారు. అయితే 15 మందిని అదుపులోకి తీసుకోగలిగారు. వారిని తమిళనాడు తిరువన్నామలై జిల్లా జమనామత్తూరుకు చెందిన అరుల్ (26), ఆనందన్ గోపాల్ (26), సేతు అన్నామలై (27), జయమణి ((29), చక్రవర్తి (36), శివలింగం రామన్ (40), కుప్పుస్వామి కొలంధై (28), రంజిత్ మాణిక్యం (24), కుప్పన్ గోవిందన్ (48), గోవిందరాజ్ అరుణాచలం (49), శివలింగం మొట్టియన్ (38), ఏలుమలై (42), సంతోష్ శెల్వరాజ్ (20), మహేంద్రన్ గోవిందన్ (29), జయవేల్ (26)గా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ రఫీ దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో కారుడ్రైవర్ మృతి

కృష్ణలంక (విజయవాడతూర్పు): అనుమానాస్పద స్థితిలో ఓ కారుడ్రైవర్ మృతి చెందిన ఘటన విజయవాడలో సంచలనం రేపింది. ఈ మరణంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తిరుపతిలోని సప్తగిరినగర్‌కు చెందిన ఉప్పలపాటి గిరిధర్(55) తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైకు చెందిన కంచి గోపీకృష్ణ అనే వ్యాపారి వద్ద కారుడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతని భార్య కొన్నేళ్ల క్రితం మృతి చెందగా కుమారుని వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో గిరిధర్ తన యజమాని గోపీకృష్ణ, అతని స్నేహితుడి తల్లిదండ్రులను పని నిమిత్తం కారులో శనివారం విజయవాడకు తీసుకువచ్చాడు. లబ్బీపేటలోని ఒక హోటల్‌లో దిగారు. ఆదివారం ఉదయం 8 గంటలకు గోపీకృష్ణ డ్రైవర్ గిరిధర్‌కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. కారు వద్దకు వెళ్లి డోర్ తీసి చూడగా గిరిధర్ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే అతడిని దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి చూసి మృతిచెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గోపీకృష్ణ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని గాంధీపార్కు సమీపంలో ఆదివారం ట్రక్ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ మొద్దు వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. 600 కేజీల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. సూత్రధారి శ్రీనివాసులుపై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మినీ లారీ సీజ్ : ముగ్గురిపై కేసు

స్థానిక పాగొట్టం కాలనీ సమీపంలో శనివారం రాత్రి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. మినీ లారీలోని 1,750 కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ సద్దాం హుస్సేన్‌తోపాటు సూళ్లూరుపేటకు చెందిన ప్రవీణ్ రెడ్డి, నాయుడుపేటకు చెందిన రంగయ్యపై కేసు నమోదు చేశారు.

రౌడీషీటర్ జన్మదిన వేడుకల్లో గూడూరు ఎమ్మెల్యే

- మూడు హత్య కేసులున్న వ్యక్తికి కేక్ తినిపించిన పాశం సునీల్‌కుమార్
- రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని తూచా తప్పకుండా పాటిస్తున్న వైనం



రౌడీషీటర్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

సాక్షి, టాస్క్‌ఫోర్స్: 'అరాచకాలు సృష్టించడం.. రౌడీయిజం చేయడం.. దందాలకు పాల్పడటం లాంటివి చేస్తే ఎవరినైనా, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు' గత ఎన్నికల ప్రచారంలో గూడూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ చెప్పిన మాటలు ఇవి. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఎమ్మెల్యే సునీల్‌కుమార్ వాటన్నిటినీ పక్కన పెట్టేశారు. లోకేశ్ చెప్పిన విధంగా ఎవరి మీద ఎక్కువ కేసులు ఉంటాయో వారికే తమ పార్టీలో ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నారు. గత వారం గూడూరుకు చెందిన రౌడీషీటర్ కనుపూరు శ్రీహరి (జెమిని) పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్యే సునీల్‌కుమార్ పాల్గొన్నారు. అతడికి కేక్ తినిపించి మరీ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. జెమిని పట్టణంలో దందాలు చేస్తూ రౌడీషీటర్‌గా ఉన్నాడు. అతడిపై ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో మూడు మర్డర్ కేసులు కూడా ఉన్నాయి. స్థానిక ఎమ్మెల్యే రౌడీషీటర్లను పెంచి పోషించేలా వారి పుట్టిన రోజు వేడుకలకు హాజరు కావడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది.

మనవాళ్లే వదిలేయండి!

గూడూరు నియోజకవర్గంలో అధికారం చేట్టిన రోజు నుంచి రౌడీలతోనే పాలన కొనసాగించేలా సంకేతాలు ఇస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ గ్రావెల్, మట్టి, ఇసుక తరలింపులను నేరుగా ప్రోత్సహిస్తూ కమీషన్ల రూపంలో రూ.లక్షలు దండుకుంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రౌడీషీటర్ల ద్వారా గంజాయి, పేకాట, జూదం (డైమండ్ డబ్బా) ఆటలు నిర్వహిస్తూ వారికి అండగా నిలుస్తున్నారు. ఎక్కడైనా పట్టుబడితే పోలీసులకు 'మన వారే వదిలేయండి' అని ఆదేశాలు ఇస్తున్నట్టు పబ్లిక్ టాక్. ఈ క్రమంలోనే పట్టణంలోని పాత నేరస్తులను చేరదీసి వారికి ఏరియాలను అప్పగించినట్టు సమాచారం. దీంతో వారు ఆడిన ఆటకు అటు పోలీసులు కూడా అడ్డు చెప్పడం లేదు.

ఆ విషయం తెలియదు

జెమినిపై ఉన్న కేసుల విషయమై పట్టణ ఎస్ఐ, సీఐలను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. తాము వారం క్రితమే బదిలీల్లో భాగంగా వచ్చామని చెప్పారు. ఎవరిపై రౌడీషీట్లు ఉన్నాయి, మర్డర్ కేసులు ఉన్నాయనే విషయాలపై ఇంకా దృష్టి పెట్టలేదని సమాధానం దాటవేశారు.

రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు మృతి



రామకృష్ణారెడ్డి మృతదేహం

తడ: జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాంబట్టు సెజ్‌లోని ఓ ప్రైవేటు పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న దువ్వూరు రామకృష్ణారెడ్డి(60) మృతి చెందాడు. ఎస్ఐ నరసింహారావు కథనం మేరకు.. తడ మండలం, కారిజాత గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి తన స్కూటీపై విధులకు హాజరయ్యేందుకు బయలుదేరాడు. జాతీయ రహదారి కూడలి నుంచి మాంబట్టుకు వెళ్లేందుకు స్కూటీ మలుపు తిరుగుతున్న సమయంలో చెన్నై నుంచి సూళ్లూరుపేట వైపు వెళుతున్న బుల్లెట్ బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రామకృష్ణారెడ్డిని అపాచీ పరిశ్రమకు చెందిన అంబులెన్స్‌లో సూళ్లూరుపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబీకులు అప్పగించారు.

ఆక్రమణ.. 'అంబేడ్కర్' ఆవరణ

- రూ.కోట్ల స్థలం కబ్జా చేసిన టీడీపీ నేతలు
- రాత్రికి రాత్రే వెలసిన షెడ్లు
- మండిపడుతున్న ప్రజా సంఘాలు



ఆక్రమిత స్థలంలో టీడీపీ నేతలు వేసిన రేకుల షెడ్

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌కు చెందిన స్థలాన్ని టీడీపీ నేతలు దర్జాగా కబ్జా చేశారు. రాత్రికి రాత్రే రేకుల షెడ్లు నిర్మించేశారు. పచ్చనేతల దురాగతాన్ని చూసి మున్సిపల్ అధికారులు సైతం నివ్వెరపోయారు. వివరాలు.. పట్టణంలో వ్యాపార కూడలిగా మారిన ప్రాంతంలో అంబేడ్కర్ భవన్ ఉంది. అది శిథిలావస్థకు చేరడంతో సార్వత్రిక ఎన్నికల ముందు అప్పటి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రత్యేక చొరవ తీసుకుని అభివృద్ధి చేశారు. రూ.75లక్షలకు పైగా వెచ్చించి అధునాతన హంగులతో అంబేడ్కర్ భవన్‌ను తీర్చిదిద్దారు. ఇందులో వివాహాది శుభ కార్యాలు, ఇతర సమావేశాలు నిర్వహించుకునేవారు. భవన్ ఎదుట ఖాళీ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేసుకునేవారు. రూ.కోట్ల విలువైన ఈ ఖరీదైన స్థలంపై స్థానిక టీడీపీ నేతలు కన్నేశారు. అనుకున్నదే తడవుగా అందులో రేకుల షెడ్లు వేసేశారు. పచ్చనేత ఆక్రమణపై పలు ప్రజా సంఘాలు, పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డిని వివరణ కోరగా.. అంబేడ్కర్ భవన్ వద్ద రేకుల షెడ్లను పరిశీలించామన్నారు. వాటిని వెంటనే తొలగించాలని హెచ్చరికలు సైతం జారీ చేశామని వెల్లడించారు. ఆక్రమించినవారు తొలగించకుంటే తామే ఆ పని చేస్తామని స్పష్టం చేశారు.



సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR

Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry 9381287629

Real Estate

తిరుపతిసిటీయలో ఓపెన్ ప్లాట్స్/ల్యాండ్స్, కమర్షియల్ ప్లాట్స్ తీసివ్వబడును & అమ్మించబడును. తొండవాడ, వెల్లోపల్లి, మల్లంగుంట, తనపల్లి, తిరుచానూరు, రేణిగుంటఎయిర్‌పోర్ట్, మంగళం. 8179668059.

PLOT FOR SALE

తిరుపతి, బైరాగిపట్టెడ అన్నమయ్య నగర్ తుడ అప్రూవ్డ్ ప్లాట్ 25x44 ఈస్ట్ ఫేసింగ్ అమ్మబడును. సంప్రదించండి సెల్: 95388 15012 (డైరెక్ట్).

గూడూరు to వెంకటగిరి TNR గ్రాండ్ తివ్వవరప్పాడు మెయిన్‌రోడ్డు ప్రక్కన 25 ఎకరాల ఫామ్ ల్యాండ్ అంకణం ధర: 30,000/-. ప్లాటు సైజు 60 అంకణం కల్ప. సంప్రదించండి: 95734 75038.

Wanted

Work From Home Work on Social Media 2-3 Hours Daily ఎటువంటి ఫీజు అవసరం లేదు. Income 20,000-40,000 ప్రతి నెల పొందే అవకాశం. 9502443549, 8667856929.

అమెజాన్ కంపెనీలో డెలివరీ బాయ్స్ గా చిత్తూరు నందు పనిచేయుటకు ఆసక్తిగల అభ్యర్థులు (పురుషులు మాత్రమే) కావలెను. శాలరీ : ₹ 18 వేలు to ₹ 20 వేలు, జాబ్ లోకేషన్: చిత్తూరు, Q: 10th / ఇంటర్ + అనుభవం : 0-1 సం. వివరాల కొరకు సంప్రదించండి: VENTURE FIRST, కొత్త బస్టాండ్ కార్యాలయం దగ్గర, చిత్తూరు. సెల్: 7089614662.

YIP PVT LTD recruits Male or Female Age 18 to 45, Qul: 10th to Any Degree, Salary 18000 and above work from home facility is available. 8121818692

తిరుపతి నగరం చెన్నై బైపాస్‌లోని ప్రముఖ కార్ షోరూం నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 12 గంటల డ్యూటీ, జీతం: 12,000 సం.ప్ర: 91829 64178.

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ. 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని ఖచ్చితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం చేయాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము.